క్లుప్తంగా

బీచ్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ


ట్రోఫీతో గౌతమి సుహానా

తాడిపత్రిటౌన్: రాష్ట్ర స్థాయి బీచ్ కబడీ పోటీల్లో తాడిపత్రి క్రీడాకారులు గౌతమి, సుహానా అత్యంత ప్రతిభకనబరిచినట్లు సాయి చైతన్య స్కూల్ అండ్ అకాడమీ కోచ్ లక్ష్మీనరసింహ సోమవారం తెలిపారు. ఈ నెల 4న కాకినాడలో ఆంధ్ర కబడీ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి బీచ్ కబడీ పోటీల్లో గౌతమి జిల్లా జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారన్నారు. పోటీల్లో గౌతమి, సుహనా ప్రతిభ కనబరిచి జట్టును మూడో స్థానంలో నిలిపారన్నారు. గౌతమి నేషనల్ క్యాంపునకు సెలెక్ట్ అయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

31న వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట


యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 31న నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు శేష గిరిశర్మ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే అదేరోజు ఉదయం కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు కేతిరెడ్డి వెంకటనాగిరెడ్డి, కేతిరెడ్డి వెంకట మోహన్‌రెడ్డి (వైఎస్సార్ హాస్పిటల్) సౌజన్యంతో రాష్ట్ర స్థాయి రాతి దూలం పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రతిభ చూపిన వృషభాలకు మొదటి బహుమతి రూ.లక్షా 20వేలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడో బహుమతి రూ.80 వేలు, నాల్గో బహుమతి రూ.60 వేలు, ఐదో బహుమతి రూ.40 వేలు, ఆరో బహుమతి రూ. 30 వేలు, ఏడో బహుమతి రూ.20 వేలు, కన్సలేషన్ బహుమతి రూ. 10వేలు అందజేస్తారన్నారు.

దుకాణాలపై దాడులు


సీజ్ చేసిన ప్లాస్టిక్ కవర్లను చూపుతున్న కమిషనర్ నయీమ్

గుంతకల్లు టౌన్: పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న హోటళ్లు, కిరాణా దుకాణాలు, బేకరీలపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు ఏకకాలంలో 8 దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన 170 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశారు. ఆయా దుకాణాల నిర్వాహకులకు రూ.13,500 జరిమానా విధించినట్లు కమిషనర్ నయూమ్ అహ్మద్ తెలిపారు. తనిఖీల్లో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శిక్షణ


ప్రసంగిస్తున్న అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్‌జాఫర్

గుంతకల్లుటౌన్: హజ్ యాత్రకు వెళ్లనున్న వారికి అంజుమన్-ఎ-ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమమ నిర్వహించారు. సోమవారం అంజుమన్ కార్యాలయంలో కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మతగురువులు హఫీజ్ ఖలీలుల్ రహిమాన్, ఇస్మాయిల్, అదనపు ప్రభుత్వ ఖాజీ సత్తార్ సాబ్ మాట్లాడుతూ హజ్ ప్రాముఖ్యత, అక్కడ పాటించాల్సిన ఆచారాలు, నియమాలు, దర్శనీయ స్థలాలు, ప్రార్థనల గురించి వివరించారు. అనంతరం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షుడు హాజీ రహిమాన్ సాబ్, సభ్యులు వలిబాషా, ఆర్‌డీజీ బాషా, అప్రోజ్, నూర్‌బాషా, అష్రఫ్, గులామ్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

'శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి'

గుంతకల్లు: పట్టణ శివారులోని దొనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీవాసులకు శ్మశాన వాటికలను కేటాయించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఈ కాలనీలో ఎవరైనా చనిపోతే ఖననం చేయడానికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్మశాన వాటికు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు వేర్వేరుగా శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డే రమేష్, వనగొంది విజయలక్ష్మీ, గుర్రం సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, సతీష్ చౌదరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు మంగళం!

- అధికారులు, కూటమి నేతల మధ్య కుదరని సఖ్యత
- ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం లేక పనుల బంద్
- ఇబ్బందుల్లో కూలీలు


గుమ్మేపల్లిలో ఉపాధి పనులు లేక బారాకట్ట ఆడుతున్న మహిళలు


రచ్చకట్టపై గ్రామస్తుల ముచ్చట్లు

శింగనమల: శింగనమల మండలంలోని గుమ్మేపల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు చేపట్టకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం చేయడంలో కూటమి నేతలు, అధికారుల మధ్య సఖ్యత కుదరక, ఆ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులకు మంగళం పాడారు. మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నా.. ఈ పంచాయతీలో మాత్రం పనులు కల్పించకపోవడంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది.

గుమ్మేపల్లిలో 500 జాబ్ కార్డులు

గుమ్మేపల్లి గ్రామ పంచాయతీలో గుమ్మేపల్లి, ఏకులనాగేపల్లి గ్రామాలున్నాయి. పంచాయతీలో 500 జాబ్ కార్డులుండగా, దాదాపు 800 మంది దాకా ఉపాధి కూలీలున్నారు. కూటమి ప్రభుత్వం కొలువయ్యాక గతంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఖాళీ కావడంతో, టీడీపీ కార్యకర్తలు ఈ పోస్టు కోసం ప్రయత్నాలు చేశారు. కానీ ప్రజాప్రతినిధులు, నాయకులు మధ్య సఖ్యత కుదరకపోవడంతో ఎవరినీ నియమించలేదు. కానీ పంచాయతీలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా పనులు చేయించాల్సి ఉన్నా, అధికారులు పట్టించుకోలేదు. దీనితో కూలీలు ఉపాధి పనులకు నోచుకోవడం లేదు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మా గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలని అధికారులు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీకి ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేదు. అధికారులు స్పందించి ఉపాధి హామీ పనులు కల్పించాలి.

– దేగల ఓబిలేసు, కూలీ, గుమ్మేపల్లి, శింగనమల మండలం

త్వరలో పనులు కల్పిస్తాం



మండలంలోని గుమ్మేపల్లి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం అలస్యం కావడంతో పనులు చేపట్టలేదు. ఇటీవల ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎంపిక చేశాం. త్వరలో కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పిస్తాం. ఈ విషయంలో ఉపాధి కూలీలు ఆందోళన చెందనవసరం లేదు.

– భాస్కర్, ఎంపీడీఓ, శింగనమల

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి కృతజ్ఞతలు


మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దవడుగూరు: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతపురంలోని నివాసంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ ప్రధాన కార్యదర్శిగా రావులుడికి సర్పంచ్ రంగేశ్వరరెడ్డి, జిల్లా బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి కాశేపల్లి రామాంజులరెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, భీమునిపల్లి రామచంద్రారెడ్డి, కొండూరు దేవమోహన్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, కోనాపురం రామాంజనేయులు పాల్గొన్నారు.

రాయితీతో పశువుల దాణా

బుక్కరాయసముద్రం: కరువు మండలాలైన బీకేఎస్, నార్పలలో 50 శాతం రాయితీతో పశువుల దాణా రైతులకు సరఫరా చేస్తున్నామని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రత్నాకర్ సోమవారం తెలిపారు. ఈ పథకంలో ఒక్కో రైతుకు 50 కేజీల పశువుల దాణా అందజేస్తామన్నారు. దాణా కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో పశు సంవర్ధక సహాయకులను సంప్రదించాలన్నారు.

పథకాలన్నీ టీడీపీ నాయకులకేనా?


జిల్లా స్థాయి కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తున్న బీకేఎస్ జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: సంక్షేమ పథకాలన్నీ టీడీపీ నాయకులకే మంజూరు చేస్తూ అధికారులు ఏక పక్షంగా వ్యవహరించడం సరికాదని బీకేఎస్ జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నీలం భాస్కర్ మండి పడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని షిరిడీ సాయి కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణికి వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ భాస్కర్ మాట్లాడుతూ పశువుల షెడ్ల నిర్మాణాల్లో అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తూ కేవలం టీడీపీ నాయకులు చెప్పిన వారికే కేటాయించి, అర్హులైన పేదలకు మంజూరు చేయక పోవడం దారుణమన్నారు. గత డిసెంబర్‌లో అర్హులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు డ్వామా పీడీకి విన్నవించామన్నారు. దీంతో అర్హులైన 8 మంది జాబితాను ఎంపీడీఓ ఆఫీస్‌కు పంపించగా వాటిని ఎంపీడీఓ పక్కన పెట్టేసి లోకల్ టీడీపీ నాయకులతో సమస్యలు వస్తాయని అన్యాయం చేశారన్నారు. కలెక్టర్ నుంచి మంజూరు ఉత్తర్వులు వచ్చినా క్రింది స్థాయి అధికారులు వాటిని బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. అలాగే 90 శాతం రాయితీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని ఏపీ పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి వినతి పత్రం అందజేశారు. బీకేఎస్ మండల కేంద్రంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం నియోజక వర్గం కార్యదర్శి నారాయణస్వామి విన్నవించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని మోదీ చిత్ర పటాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షులు చంద్రమోహన్‌రెడ్డి కోరారు. అదేవిధంగా రేషన్ షాపు లేక ఇబ్బంది పడుతున్నామని బీకేఎస్ మండలంలోని సెంట్రల్ జైలు కాలనీ వాసులు విన్నవించారు. అలాగే కొర్రపాడు గ్రామంలో రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారిని ఆర్థిక సహాయం అందించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, దళిత సంఘం నాయకుడు నాగేంద్ర విన్నవించారు. అలాగే ఆర్డీటీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆపకుండా ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని దళిత గిరిజన ప్రజా సంఘం నాయకుడు నాగేంద్ర కోరారు. ప్రజల నుంచి మొత్తం 506 అర్జీలను స్వీకరించామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

తాడిపత్రి రూరల్: వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామాంజనేయులులు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాల వల్ల అరటి, మామిడి, సపోట, చీనీ, బొప్పాయి, మొక్కజొన్న, జామ తదితర పంటలు సాగు చేసిన రైతులకు కోట్లాది రూపాయల నష్టం ఏర్పడిందన్నారు. అలాగే గతంలో రైతులకు ఎకరానికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ విస్మరించిందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగరంగయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు గోపాల్‌క్రిష్ణ, సత్తార్, ప్రసాద్‌యాదవ్, చిన్న కుళ్లాయప్ప, చిన్ని కృష్ణుడుయాదవ్, నాగార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

శింగనమల: భూసార పరీక్షల పత్రాల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలని వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌రెడ్డి, అన్వేష్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం శింగనమల పీఏసీఎస్‌లో మట్టి నమునాలపై రైతులకు అవగాహన కలిగించారు. వారు మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఏఈఓ అక్కమ్మ, విశ్వేశ్వరి, పీఏసీఎస్ సీఈఓ నారాయణ స్వామి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ


వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్ అశ్వ రాముడు, అశ్వ చిన్నమారెన్న, అశ్వ సురేష్‌ను మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సోమవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకుల సోదరుడు అశ్వ విజయ్ ఇటీవల జక్కలచెరువు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బెంగళూరులో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రషర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు పెద్ద మారెన్న, అశ్వ పుల్లయ్య, గురుప్రసాద్ యాదవ్, హుస్సేన్‌పీరా, గోవర్ధన్‌రెడ్డి, రంగస్వామి, హరిబాబు, ఫయాజ్, అన్సర్, దస్తగిరి, బ్రహ్మ, షఫీ, అబ్దుల్, నూర్‌నాయక్, రమేష్‌రెడ్డి, సికిందర్, బింగికిరణ్, రౌఫ్, అన్వర్, మల్లికార్జున, లాలు, కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్:అనారోగ్యం కారణంగా స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత గాలి మల్లికార్జునను సోమవారం గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు. నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, దశరథరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ చైర్మన్ జేసీ కక్ష సాధింపు


వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటిని పరిశీలిస్తున్న కమిటీ బృందం

తాడిపత్రి రూరల్: తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ నాయకలను టార్గెట్ చేస్తూ టీడీపీ నాయకుడు, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కక్ష సాధింపుల పర్వం కొనసాగుతోంది. కమిటీ పేరుతో మరోసారి రెవెన్యూ, మునిసిపల్ అధికారులను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫయాజ్ బాషా ఇంటిపైకి ఉసిగొల్పారు. పట్టణంలోని చిన్న బజారులో ఉన్న ఫయాజ్‌బాషా ఇంటి కొలతల కోసం సోమవారం మునిసిపల్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన తొమ్మిది మంది వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీ వెళ్లింది. కమిటీలో తహసీల్దార్ రజాక్‌వలి, సబ్‌రిజిస్ట్రార్ శివనారాయణ, మునిసిపల్ డీఈ రాంప్రసాద్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ మహబుబ్‌బాషా,మునిసిపల్, మండల సర్వేయర్లు కౌవల్యసాయి, రామ్మోహన్, 10, 11, 27వ వార్డు కౌన్సిలర్లు పైజూన్, హేమావతి, రేష్మాపర్వీన్ ఉన్నారు. వీరంతా వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటి వద్దకు వెళ్లారు. ఇంటి ప్రధాన గేటు మూసి ఉండటంతో చుట్టుపక్కల ఇళ్లల్లోని వారి నుంచి పంచనామా కోసం సంతకాలను తీసుకున్నారు. ఇంటి యజమాని అందుబాటులో లేకపోవడంతో ఇంటికి సంబంధించిన కొలతలను తీసుకునే కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందుజాగ్రత్తగా పట్టణ సీఐ సాయిప్రసాద్, ఎస్‌ఐ గౌస్, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఫయాజ్‌బాషా ఇంటికొలతల విషయంలో చోటు చేసుకున్న పరిమాణాలపై కమిషనర్ శివరామక్రిష్ణతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. తదుపరి చర్యలపై సమాలోచనలు చేశారు. ఈ విషయమై ఫయాజ్‌బాషా సాక్షితో మాట్లాడుతూ మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తనపై కక్ష సాధింపుకు దిగుతున్నారన్నారు. పట్టణంలో ఎన్నో అక్రమ కట్టడాలు ఉండగా వాటి జోలికి వెళ్లకుండా అన్ని అనుమతులలతో సక్రమంగా నిర్మించుకున్న తన ఇంటిపైకి అధికారులను ఉసిగొల్పుతున్నారు. వివాదం కోర్టులో ఉన్నప్పటికీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి సర్వే

తాడిపత్రి రూరల్: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో వాటర్ ట్యాంకు వద్ద వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిని మంగళవారం మునిసిపల్ అధికారులు సర్వే చేయనున్నారు. సర్వే నెంబర్ 639, 640, 641ల్లోని ప్లాట్ నెంబర్ 1 నుంచి 16 కు సంబంధించి మునిసిపల్ స్థలం అక్రమణకు గురైందో లేదో తెలుసుకునేందుకు ఉదయం 11గంటలకు మునిసిపల్ అధికారులు సర్వే చేపట్టనున్నారు. ఈ సర్వే నెంబర్లలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డితో పాటు పలువురి ఇళ్లు ఉన్నాయి. సర్వే సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా, అడ్డంకులు ఎదురుకాకుండా తమకు భద్రత కల్పించాలని పట్టణ పోలీసులకు కమిషనర్ శివరామక్రిష్ణ వినతి పత్రం ఇచ్చారు.

ఎస్ఎంయూ నిరసన

తాడిపత్రి: తమ డిమాండ్లు పరిష్కారం కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ తాడిపత్రి డిపో ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికులు సోమవారం తాడిపత్రి మండల తహసీల్దార్ రజాక్ వలికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా కార్యదర్శి ప్రతాప్ నారాయణ, డిపో అధ్యక్షులు కేజీఎన్ బాబుల ఆధ్వర్యంలో బస్టాండ్‌లో నిరసన తెలిపిన ఎస్ఎంయూ సభ్యులు అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్యారేజీ కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ నాయకుడు కె.నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా కమిటీ మెంబర్ ఎం. ఎం. సుధాకర్ పెద్ద ఎత్తున ఎస్ఎంయూ సభ్యులు పాల్గొన్నారు.

మండల జర్నలిస్ట్ అసోషియేషన్ కమిటీ ఏకగ్రీవం

పెద్దవడుగూరు: మండల జర్నలిస్ట్ అసోషియేషన్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలో మండలంలోని జర్నలిస్టులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు అధ్యక్షుడిగా ధనుంజయరెడ్డి(ఆంధ్రప్రభ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బొట్టు సూర్యనారాయణ(సాక్షి), ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు (సూర్య), రంగనాథ్ (అక్షర)ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రజాశక్తి విలేఖరి రామాంజనేయులు, శివశంకర్, కుళ్లాయప్ప, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి యువకుడికి గాయాలు


గుత్తి రూరల్: పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో ఇంటిపై నుంచి పడి సుధాకర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. జెడ్.వీరారెడ్డి కాలనీకి చెందిన సుధాకర్ ఆదివారం రాత్రి ఇంటిపై నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో నిద్రమత్తులో మూత్రవిసర్జన కోసం వెళ్తూ మిద్దెపై నుంచి జారి కిందకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

గొర్రెల కాపరికి బెదిరింపులు

యల్లనూరు: గొర్రెలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని అంకన్న అనే వ్యక్తి సోమవారం ఎస్ఐ రామాంజినేయరెడ్డికి ఫిర్యాదు చేశాడు. వివరాలు.. మండలంలోని గడ్డంవారిపల్లికి చెందిన పుటకాల అంకన్న ఏప్రిల్ 10వన 93 గొర్రెలు, 33 పిల్లలను రూ.10.69 లక్షలకు వైఎస్సార్ జిల్లా తొండూరు మండలం కారంపల్లికి చెందిన బొచ్చ నాగేష్ అనే వ్యక్తికి విక్రయించాడు. గొర్రెలను కొనుగోలు చేసే సమయంలో అతడు అడ్వాన్సు కింద అంకన్నకు రూ.63 వేలు చెల్లించాడు. నెలరోజుల్లో మిగిలిన సొమ్ము ఇస్తానని చెప్పి. ఇప్పుడు డబ్బులు ఇచ్చేది లేదని దిక్కున్న చోట చెప్పుకోండంటూ బెదిరిస్తున్నాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు బొచ్చ నాగేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బంకులను తొలగించాలి


బంకులను పరిశీలిస్తున్న గుత్తి ఆర్టీసీ ఇన్‌చార్జ్ డీఎం

పామిడి: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వెలసిన అక్రమ బంకులను తొలగించాలని గుత్తి ఆర్టీసీ ఇన్‌చార్జ్ సీఎం గంగాధర్ సూచించారు. సోమవారం ఆయన బస్టాండ్ ఆవరణను పరిశీలించారు. ఆర్టీసీ స్థలంలో బంకులను ఎలా ఏర్పాటు చేస్తారంటూ దుకాణదారులను ప్రశ్నించారు. పంచాయతీ ఈఓ గోపాల్ చెబితేనే తాము బంకులు ఏర్పాటు చేసుకున్నామంటూ వారు బదులిచ్చారు. ఆర్టీసీ స్థలంలో బంకుల ఏర్పాటుకు ఈఓకు ఏమి సంబంధం అంటూ? డీఎం ప్రశ్నించారు. తక్షణం అక్రమంగా వేసిన బంకులను తొలగించుకోవాలన్నారు. లేని పక్షాన జేసీబీతో తొలగించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు సీఐ వీ యుంగధర్‌కు డీఎం ఫిర్యాదు చేశారు. డీఎం వెంట గుత్తి డిపో సూపరింటెండెంట్ శ్రీపాద, డిపో పోలీసులు గిరి, రెడ్డి, సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

పామిడి: అనంతపురం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కత్రిమల గ్రామానికి చెందిన వడ్డే నాగేంద్ర (30) సోమవారం మృతి చెందాడు. గత శనివారం కత్రిమల గ్రామంలోని వడ్డే నల్లప్ప ఇంటి ముందు స్థలం విషయం, మురుగు, చెత్తాచెదారం వేయడంపై వడ్డే నల్లప్ప, సుబ్బారెడ్డి వర్గీయులు ఘర్షణ పడిన విషయం తెలిసిందే. ఈ గొడవలో గాయపడి చికిత్స పొందుతున్న నాగేంద్ర మృత్యు ఒడికి చేరాడు. అతడికి భార్య అనూష, కుమారుడు, కుమార్తె సంతానం. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సుబ్బారెడ్డి, అతని కుమారుడు, బంధువులైన మరో పదిమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి తదితరులు ఆ గ్రామానికి వెళ్లి నాగేంద్ర మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలి

బుక్కరాయసముద్రం/పెద్దవడుగూరు/పుట్లూరు: ఉమ్మడి జిల్లాలో 56 సంవత్సరాలుగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని కోరుతూ సోమవారం బీకేఎస్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాకే రాజు, బండారు నల్లప్ప, మహేష్, శివ శంకర్, పుల్లయ్య, సాయి శశిరేఖ, వెంకటరాముడు, రమాదేవి, సుబ్రమణ్యం, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులో సేవ్ ఆర్డీటీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పెద్దపప్పూరు ఆదినారాయణ, దిమ్మగుడి కత్తుల కొండయ్య, నాయకులు రంగస్వామి, భూపతి తదితరులు పాల్గొన్నారు. అలాగే పుట్లూరులో నిర్వహించిన సేవ్ ఆర్డీటీ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకుందాం


గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు


తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకుల నిరసన

గుత్తి రూరల్/తాడిపత్రి: ప్రభుత్వ పాఠశాలలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు బాషా, ఆదినారాయణరెడ్డి, రామచంద్ర, కిరణ్ కోరారు. గుత్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 1 నుంచి 5వ తరగతి వరకూ ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలలో 6, 7 తరగతులు కొనసాగుతున్న చోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 6, 7, 8 తరగతులు ఉన్న చోట ఆరు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. జీఓ-55 విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం, విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలలో మాతృభాషను కొనసాగించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలన్నారు. 2003 డీఎస్సీ వారికి వెంటనే ఓపీఎస్ అమలు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే ప్రకటించాలని అన్నారు. 11వ పీఆర్సీ బకాయిలతో పాటు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ చెల్లించాల్సిన అన్ని రకాల ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ప్రదీప్, కిరణ్, శీనా, దాదా, రవి, రాజేష్, నూర్, ఖాజా, ఇలియాజ్, మాధవి, గీతా, ప్రేమావతి పాల్గొన్నారు. అలాగే తాడిపత్రిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి డేనియల్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎస్. రఘురామిరెడ్డి, జిల్లా పూర్వపు కార్యదర్శి రాందాస్‌రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, ఉపేంద్ర, ఓబయ్య, అంజన్, రవి, రాజశేఖర్, కిషోర్, భాస్కర్‌రెడ్డి, విశ్వనాథ, జయచంద్ర, రామాంజి తదితరులు పాల్గొన్నారు.అనంతరం తహసీల్దార్ రజాక్ వలికి వినతిపత్రం అందజేశారు.

సాగు, తాగునీటి సమస్య పరిష్కరించండి

గుంతకల్లు: హంద్రీ-నీవా జలాలను కేటాయించి నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆయనతోపాటు రైతుసంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గంలోని ఆయకట్టుకు హంద్రీ-నీవా నీటి కేటాయింపులు లేవన్నారు. కేవలం పాతకొత్తచెరువు, వైటీ చెరువుల కింద ఉన్న 1500 ఎకరాలకు మాత్రమే హంద్రీ-నీవా జలాలు అందుతున్నాయన్నారు. రాగులపాడు నుంచి గుంతకల్లు నియోజకవర్గంలోని 17 చెరువులకు, చెక్‌డ్యాంలకు సాగు, తాగునీరు అందించే పథకానికి టెండర్లు కూడా పిలిచారన్నారు. ప్రభుత్వం భూసేకరణకు నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

గ్రీవెన్స్‌లో సెల్‌ఫోన్‌తో కాలక్షేపం!


గ్రీవెన్స్‌లో సెల్‌ఫోన్లు చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్న పలుశాఖల అధికారులు

యల్లనూరు: మండలంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అధికారులు సెల్ ఫోన్ చూస్తూ సాక్షి కెమెరాకు చిక్కారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన ఉద్యోగులు ఇలా సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేయడాన్ని పలువురు తప్పుపట్టారు. ఇలా గైతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రజలు, రైతులు చర్చించుకుంటున్నారు. కాగా 16 శాఖలు ఉండగా కేవలం ఐదారు శాఖల అధికారులు మాత్రమే హాజరు కావడం గమనార్హం.